నవరత్న పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- పత్తేపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



పథకాల లబ్ధిదారులకు సంక్షేమ బావుటా కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: నవరత్న పథకాల అమలుతో రాష్ట్రంలోని ప్రతి ఇంటా వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని స్థానిక ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం పత్తేపురం గ్రామంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. శుక్రవారంతో గడపగడపకు మన ప్రభుత్వం నియోజకవర్గంలో చేపట్టిన 125వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఇంటింటికీ తిరిగి ప్రతి కుటుంబాన్ని పలకరించి ఆయా కుటుంబాలకు గత మూడేళ్లలో ప్రభుత్వం నుంచి అందిన నగదు లబ్ధిని వివరించి కరపత్రాలను అందించారు. పథకాల అమలు తీరుపై ప్రజల స్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీకి రోజు రోజుకు ఆదరణ పెరగడంతో టీడీపీ నేతల్లోనూ, చంద్రబాబుకు వెన్నులో వణుకు పుడుతోందన్నారు. 2024లో ఘోర పరాజయం తప్పదని గ్రహించిన చంద్రబాబు, ఇవే నాకు చివరి ఎన్నికలని చెప్పుకుంటూ ఆయన కుమారుడు లోకేష్‌ని పాదయాత్రకు పంపించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. అధికారం కోసం గత్యంతరం లేక నవరత్న పథకాలను తానూ కొనసాగిస్తానంటూ చంద్రబాబు ప్రజలను వేడుకుంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తితో ఉన్నాయని అన్నారు. వైఎస్సార్ సీపీకి మళ్లీ అధికారం అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, మండల కన్వీనర్ సంకు సత్య కుమార్, గ్రామ, గ్రామ పార్టీ అధ్యక్షులు రుద్రరాజు అప్పలరాజు, ఆర్‌బీకే చైర్మన్ పాతూరి బెనర్జీ, ఎన్ శ్రీనివాసరావు, ఏఈ మురళీకృష్ణ తదితరులున్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'కు ఆదరణ



వంగూరులో వృద్ధురాలికి వైద్యం అందిస్తున్న

పెదవేగి : ఫ్యామిలీ డాక్టర్ విధానానికి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పి.పూర్ణిమ అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం వంగూరు పంచాయతీ సచివాలయంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. పెదవేగి పీహెచ్‌సీ పరిధిలో 28 సచివాలయాల్లో టూర్ షెడ్యూల్ ప్రకారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓపీ అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాలు, గుడ్లు, పంపిణీ తీరుపై ఆరా తీశారు.

అభివృద్ధి పథంలో గుండుగొలను సొసైటీ



సొసైటీ మహాసభ సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్‌పర్సన్ విజయ వెంకట భాస్కర్

భీమడోలు: గుండుగొలను సొసైటీ అభివృద్ధి పథంలో నడుస్తూ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తోందని గుండుగొలను విశాల సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్ వగ్వాల విజయ వెంకట భాస్కర్ అన్నారు. గుండుగొలనులోని రైతు సహకార వేదిక వద్ద శనివారం నిర్వహించిన మహాజన సభకు చైర్‌పర్సన్ వగ్వాల విజయ వెంకటభాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఈవో కె.జగదీష్‌కుమార్ నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా వగ్వాల భాస్కర్ మాట్లాడుతూ తమ హయాంలో తీసుకొచ్చిన అనేక సంస్కరణలు, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టడం ద్వారా గుండుగొలను సొసైటీ జిల్లాస్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. రైతులకు తక్షణమే రుణాలు అందించడంతో పాటు వారి సంక్షేమానికి తమ వంతు కృషి చేశామన్నారు. తద్వారా రూ.కోటి రూపాయలు వరకు లాభాలు ఆర్జించిందన్నారు. రైతులకు హమాలీ చార్జీలను చెల్లించి జిల్లా స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఇప్పటికే సంఘ చరిత్రలో వ్యాపార లావాదేవీల ద్వారా అత్యధిక లాభాలు సాధించిన పాలకమండలిగా గుర్తింపు పొందామన్నారు. వచ్చిన లాభాల్లోంచి సభ్యులకు డివిడెంట్లను అందించామన్నారు. ఆగడాలలంకలో కల్యాణ మండపం నిర్మిస్తామన్నారు. గుండుగొలను సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనుమాల రామయ్య, గ్రామ ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, ఆగడాలలంక సర్పంచ్ భలే రాంబాబు, సొసైటీ డైరెక్టర్లు బొబ్బిలి శ్రీనివాసరావు, సైదు గోపాలకృష్ణ, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, సొసైటీ పరిధిలోని గ్రామాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలి



చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెదవేగి : రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ జేడీఏ రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల పంటల సాగు వారోత్సవాలపై పెదవేగి మండలం బి.సింగవరం గ్రామంలో గ్రామ సర్పంచ్ పరసా సరస్వతి అధ్యక్షతన, మండల వ్యవసాయాధికారి పి.ప్రియాంక ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన రైతు సభలో రామకృష్ణ మాట్లాడారు. ప్రస్తుతం చిరుధాన్యాలనే ఆహార పదార్థాలుగా తీసుకుని ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని చెప్పారు. మెట్ట మండలాల్లోనూ చిరు ధాన్యాల సాగు పెంచుకోవాలన్నారు. రైతులకు ప్రభుత్వం రాయితీల ద్వారా చిరుధాన్యాల విత్తనాలు సరఫరా చేస్తోందని చెప్పారు. పురుగుమందుల విభాగ అధికారిని సరళ మాట్లాడుతూ చిరుధాన్యాలలో వచ్చే చీడ పీడల నివారణకు మందులతో పాటు సలహాలు సూచనలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి డి.విజయ్ కుమార్, సచివాలయ వ్యవసాయాధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాలు ప్రారంభం



అచ్చమ్మ పేరంటాలమ్మను దర్శించుకుంటున్న రామచంద్రరావు, రాణి దంపతులు

దెందులూరు: మండలంలోని గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలు 66వ వార్షికోత్సవాలను ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, రాణి దంపతులు శనివారం ప్రారంభించారు. తొలుత అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు రూ.25 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని కొఠారు దంపతులు ప్రారంభించారు. ఉత్సవ కమిటీ సభ్యులు రామచంద్రరావు దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే, తాను ప్రత్యేక చర్యలు తీసుకొంటామని వారన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సొంగా విమలకుమారి, సానిగూడెం సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), పార్టీ మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, ఎస్సై వీర్రాజు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభ

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ పంచాయతీ పరిధిలో గడిచిన ఏడాది కాలంలో రూ. 94లక్షలు విలువ గల ఉపాధి పనులు నిర్వహించినట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఆడిట్ అధికారులు వెల్లడించారు. శనివారం ఉంగుటూరు పంచాయతీ సామాజిక భవనంలో ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సభకు సర్పంచ్ బండారు సింధు అధ్యక్షత వహించారు. పనులతో గ్రామంలో 810 మంది ఉపాధి పొందారని తెలిపారు. రోడ్ల వెంబడి 400మొక్కలు నాటగా, 196 మొక్కలు బతికాయని, ఫలితంగా రూ.7,900 నిరుపయోగమయ్యాయని వివరించారు. ఉంగుటూరులో మెగా గోకులం షెడ్డు నిర్మాణానికి రూ. 21లక్షలు ఖర్చుచేస్తే రూ. 90వేలు మాత్రమే ఇచ్చారని, మిగిలిన రూ. 20లక్షలు బిల్లు మంజూరు చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాతూరి విజయ్‌కుమార్ లిఖిత పూర్వకంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాతూరి జగదీష్, పంచాయతీ కార్యదర్శి గిరిధర్, గ్రేడ్-5 కార్యదర్శి విజయ్, ఎన్ఆర్ఈజీఎస్ ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్



పూళ్లలో సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్

భీమడోలు: మండలంలో ఇంటి పన్నులు, కుళాయి పన్నులు వసూలుకు శనివారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో టీం సభ్యులు రూ.10లక్షలను వసూలు చేసారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్నులు, కుళాయి పన్నుల కోసం సంబంధిత ఇంటి యాజమానులకు ఇప్పటికే డిమాండ్ నోటీసులను జారీ చేసారు. ఈ నేపథ్యంలో భీమడోలు ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ పర్యవేక్షణలో టీం సభ్యులకు వసూళ్లల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేసారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వారి నుంచి పన్నులను వసూలు చేసారు. ప్రజలంతా స్వచ్ఛందంగా వారికి పన్నుల నగదును అందించారు. మండల వ్యాప్తంగా సుమారు రూ.8 కోట్లకు పైగా పన్నులను వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ 15శాతానికి పైగా వసూలు చేసారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ప్రజల వద్దకు సిబ్బందిని పంపి వారికి అవగాహన కల్పించారు. పన్నులు చెల్లించిన వారికి రశీదు అందజేశారు. మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టికి సారిస్తున్నామని ఎంపీడీవో తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి నూరుశాతం పన్నుల వసూళ్లు చేస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

సూర్యదేవాలయానికి పోటెత్తిన భక్తులు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కై కరం -ఎ.గోకవరం రహదారిలోని సూర్యదేవాలయానికి భక్తులు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శనం చేసుకున్నారు. ఉంగుటూరు మండలంలోని అనేక గ్రామాల నుంచి భక్తులు వచ్చి సూర్యనారాయణస్వామిని దర్శనం చేసుకుని అన్న సంతర్పణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు అనుపెద్ది లక్ష్మీకాంతరావు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి సన్నిధిలో సామూహికం భక్తులు గోక్షీరాన్నం తయారు చేశారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. నారాయణపురం వెంకటేశ్వరర స్వామి ఆలయం వద్ద వార్షికోత్సవం సందర్భంగా శనివారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిచారు.

సినీ నటి జమున మృతికి సంతాపం

ఉంగుటూరు: ప్రముఖ సినీ నటి జమున హఠాన్మరణంపై ఉంగుటూరు మండలం కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం నియోజకవర్గ కళాకారుల సంఘ కన్వీనర్ చల్లా సూర్యారావు నాయుడు ఆధ్వర్యంలో పలువురు సంతాపం తెలిపారు. సూర్యారావు మాట్లాడుతూ రాజమండ్రి ఎంపీగా, నటిగా ఆమె అందించిన సేవలు మరువలేనివని అన్నారు. చేబ్రోలు కళాకారిని కలవాయి రాధారాణి, అంజిలి, వై. నాయుడు పాల్గొన్నారు.

యోగా శిక్షణ ప్రారంభం

ఉంగుటూరు: నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సహజ యోగా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 45 రోజుల యోగా సర్టిఫికెట్ కోర్సును శనివారం కళాశాలలో ప్రారంభించారు. ప్రారంభ సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కే. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన గొప్ప బహుమతి యోగ అని అన్నారు. ఆధునిక కాలంలో ఒత్తిడితో కూడిన జీవితం నుంచి విముక్తులై ఆరోగ్యవంతమైన జీవనం కోసం యోగాభ్యసన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో యోగ విద్యను నేర్పిస్తున్న సహజయోగం సంస్థ ఆధ్వర్యంలో శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ప్రతి సెమిస్టర్‌లో విద్యార్థులకు యోగా సర్టిఫికెట్ కోర్స్ నిర్వహిస్తామని తెలిపారు. సహజ యోగ సంస్థకు చెందిన కే.విజయ లక్ష్మీ యోగ విద్యను బోధిస్తున్న తీరును వివరించారు. ఏ.హనుమంతరావు యోగవిద్య ద్వారా ఆలోచనలను నియంత్రించుకునే పద్ధతులను, ధ్యానం ప్రాముఖ్యతను తెలియజేసి విద్యార్థులతో వివిధ ఆసనాలను వేయించారు. ఈ కార్యక్రమంలో సహజ యోగా సంస్థ సభ్యులు ఎస్. భారతి, కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటు





సమీక్షిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పరిధిలో కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, నూతనంగా కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చెప్పారు. ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల కోర్టు కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్, ఏఎస్సైలతో కోర్టుల్లోని పెండింగ్ కేసులు, నాన్‌బెయిలబుల్ వారెంట్లపై ఆయన సమీక్షించారు. ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ చేసే కేసులు, పోలీస్‌స్టేషన్లలోని కేసుల పరిష్కారంపై పలు సూచనలు చేశారు. బాధితులకు భరోసా, నేరస్తులు భయపడేలా శిక్షలు ఉండాలన్నారు. జిల్లాలో ఏర్పాటుచేసే కోర్టు మానటరింగ్‌సెల్‌ను ఒక సీఐ పర్యవేక్షిస్తారని, నిత్యం కేసుల పరిష్కార ప్రగతిని అంచనా వేస్తామని చెప్పారు. ఆయా కేసుల్లో బాధితులకు న్యాయం చేస్తేనే విధులు సక్రమంగా నిర్వర్తించినట్లు గుర్తించాలన్నారు. ఆయా కేసుల్లో సీజ్ చేసిన ప్రోపర్టీని కోర్టు ట్రయిల్ సమయంలో న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సమీక్షలో డీసీఆర్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, దిశ స్టేషన్ సీఐ కె.ఇంద్రశ్రీనివాస్, డీసీఆర్‌బీ ఎస్సై ప్రసాదనాయుడు, కోర్టు మానిటరింగ్ సెల్ సీఐ వి.సుధాకర్, డీసీఆర్‌బీ కోర్టు లెజన్ ఏఎస్సై సిసిలీ ఉన్నారు.

నేడు గృహసారథుల నియామకంపై సమావేశం

దెందులూరు: వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు నివాసంలో గృహసారథుల నియామకంపై ఆదివారం సమావేశం ఏర్పాటుచేసినట్టు పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు హాజరవుతారని పేర్కొన్నారు.

వ్యక్తిగత కారణాలతో ఆటో డ్రైవర్ హత్య

ఏలూరు టౌన్: వ్యక్తిగత కారణాలతోనే స్థానిక ఫైర్ స్టేషన్ ఎదురుగా ఉన్న పెట్రోలు బంక్ సందులో శుక్రవారం రాత్రి ఆటో డ్రైవర్ మాణిక్యాలరావు హత్యకు గురయ్యాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై దుగ్గిరాలకు చెందిన గొల్లా నరేష్ అతని సోదరుడు గొల్లా నవీన్ అదే ప్రాంతానికి చెందిన చింతలపూడి నాగార్జున, శనివారపుపేట ఇందిరానగర్‌కు చెందిన కోలా మణిలపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని

నేడు మాల నాయకుల సమావేశం

ఏలూరు (టూటౌన్): మాల నాయకుల సమావేశం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక జన్మభూమి పార్కు సమీపంలో నిర్వహిస్తున్నట్లు దళిత జేఏసీ కన్వీనర్ చాగంటి సంజీవ్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణమాల మల్టీపర్పస్ భవన్ నిర్మాణంపై చర్చిస్తామని, ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న మాల నాయకులంతా హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏపీ స్టేట్ ఫారెస్టు బోర్డు డైరెక్టర్ పల్లెం ప్రసాద్, నేతల రమేష్ బాబు, తేరా ఆనంద్ కుమార్, ముంగర సంజయ్, పోలిమెట్ల మోజెస్, బొల్లారపు లక్ష్మీపతి, యడ్ల ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

30న ఏలూరుకు సమర యాత్ర

ఏలూరు (టూటౌన్): రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు విద్యార్థి, యువజన సంఘాల ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 4 వరకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన సమర యాత్ర ఈనెల 30న ఏలూరు రానుందని పీడీఎస్‌యూ పట్టణ అధ్యక్షులు యం.క్రాంతి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యు.శంకర్ తెలిపారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 30న యాత్ర సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. యాత్ర వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ యూనివర్సిటీలను జిల్లాలో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు కె.లెనిన్, జిల్లా ఉపాధ్యక్షుడు మహర్షి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ ఈశ్వరి

ఏలూరు టౌన్: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజలు తమ అభిమానాన్ని చాటుకుంటున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం 47వ డివిజన్‌కు చెందిన సుమారు వంద మందికిపైగా ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే నాని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని, ఏలూరు నగరంలో చరిత్రలో లేని విధంగా 32 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. ప్రస్తుతం నియోజకవర్గం పరిధిలోని జగనన్న కాలనీల్లో 16 వేల ఇళ్ల నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్మన్ మధ్యాహ్నపు ఈశ్వరి, నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు, నాయకులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో పారదర్శకంగా పరిపాలన



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్) : ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే ప్రతి విషయాన్ని తెలుసుకోవడానికి సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చారని, తద్వారా పారదర్శకంగా పరిపాలనను ప్రజలకు అందించే వీలుంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. స్థానిక వైఎస్సార్ కాలనీలో శనివారం ఏర్పాటుచేసిన చట్టాలపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ చట్ట ప్రకారం దరఖాస్తు చేసిన 30 రోజుల్లోపు వారడిగిన సమాచారాన్ని అధికారులు ఇవాల్సి ఉంటుందని తెలిపారు. లేని పక్షంలో ఉన్నతాధికారులకు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. బాధితులకు నష్టపరిహారాన్ని అర్హులందరికీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తారని తెలిపారు. ఫిబ్రవరి 11న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ప్రత్తిపాటి తంబి, కార్పొరేటర్ నిడికొండ నరేంద్రబాబు, గ్రామస్తులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

దెందులూరు: దోసపాడులో అసైన్డ్ భూముల్లోని చేపల చెరువుల్లో కలిపేందుకు తీసుకొస్తున్న కోళ్ల వ్యర్థాల వాహనాన్ని దళితులు శనివారం అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఐ.వీర్రాజు , సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని వీఆర్‌ఓ రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యర్థాల వాహనాన్ని సీజ్ చేశారు.

హేలాపురి బాలోత్సవానికి విరాళం



విరాళం అందిస్తున్న కోటేశ్వరరావు

పెదపాడు: సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో ఫిబ్రవరి 4, 5 తేదీల్లో నిర్వహించే హేలాపురి బాలోత్సవం 3వ పిల్లల పండుగకు అప్పనవీడు మానవత శాఖ రూ.45 వేల విరాళాన్ని అందించినట్టు మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. శనివారం నిర్వహించిన మానవత సమావేశంలో సభ్యులు రూ.20 వేలు, చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు వ్యక్తిగతంగా రూ.25వేలు హేలాపురి కమిటీ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావుకు విరాళంగా అందించారు. పలువురు మానవత సభ్యులు పాల్గొన్నారు.

వాహనాలకు జరిమానా



వాహన తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్ సీఐ విల్సన్

పెదపాడు: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ సీఐ విల్సన్ అన్నారు. పెదపాడు మండలం కలపర్రు టోల్‌ప్లాజా వద్ద నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలకు సుమారు రూ.7 లక్షల అపరాధ రుసుం విధించామన్నారు. వాహనదారులు తీసుకెళ్లే సరుకుకు సరైన ధ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను సత్కరించిన సచివాలయ సిబ్బంది



యర్రమిల్లిపాడు సర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావును సత్కరిస్తున్న సచివాలయ

ఉంగుటూరు: ఉత్తమ సర్పంచ్‌గా ప్రశంసా పత్రం అందుకున్న యర్రమిల్లిపాడు సర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావును గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషోర్, ఉద్యోగులు, గ్రేడ్-5 కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


నాగులదేవునిపాడులో బోరుకు శంకుస్థాపన



నాగులదేవునిపాడులోని బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ వెంకట సుబ్బారావు

దెందులూరు: వైఎస్సార్ జలకళ పథకం పేద రైతులకు వరమని గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు అన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో మంజూరైన వైఎస్సార్ జలకళ బోరుకు నాగులదేవునిపాడులో సర్పంచ్ శంకుస్థాపన చేశారు. రైతు మోర్ల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే, సీఎం జగన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు రైతులు తదితరులున్నారు.

బాలల హక్కులను కాపాడాలి



వంగూరులో బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెదవేగి : బాలల హక్కులను కాపాడాలని గ్రామ సర్పంచ్ చీలి రూతు అన్నారు. పెదవేగి మండలం వంగూరు కమ్యూనిటీ సెంటర్‌లో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ – క్రాఫ్ ఆధ్వర్యంలో సర్పంచ్ అధ్యక్షతన బాలల హక్కులు, సమస్యలపై శిక్షణ ఏర్పాటుచేశారు. రసామాజిక కార్యకర్త ఆర్‌వీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ బాల బాలికలపై వివక్ష నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో క్రాఫ్ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.